క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత



ధన్వాడ: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న సరస్వతి ఆలయానికి ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రూ.25వేల రూపాయలను హెచ్ఎం రమేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉమేష్, సంఘం అధ్యక్షుడు బారయ్య, ప్రధాన కార్యదర్శి సుంకుబద్రినారాయణ, కో–శాధికారి సాయిబాబా, పూజారి నర్సింహులు, రమేష్, మధు, శంకర్ తదితరుల పాల్గొన్నారు.

పల్లెదవాఖాన ప్రారంభమెప్పుడో ?



మరికల్: మండలంలోని అప్పంపల్లిలో పల్లెదవాఖాన నిర్మించి ఎడాదైనా ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో గ్రామస్తులకు అనారోగ్యం చేస్తే పీహెచ్‌సీకోసం మరికల్‌కు వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి పల్లెదవాఖాన ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డ్రైయినేజీ నిర్మించాలి



మాగనూర్: మండలంలోని కొత్తపల్లిలో పలు కాలనీలలో డ్రైయినేజీ వ్యవస్థలేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిచోట్ల డ్రైయినేజీ లేకపోవడంతో కాలనీలో నడవలేని దుస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన స్పందించడం లేదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి డ్రైయినేజీ నిర్మాణం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

స్నేహితుల దినోత్సవం



ఆత్మకూర్: స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆత్మకూర్‌లో 19990–2000 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థినులు సంబురాలు జరుపుకొన్నారు. 23 ఏళ్ల క్రితం పదోతరగతి పూర్తి చేసుకున్న సందర్భంగా ఆనాటి మధురస్మృతులను గుర్తు చేసుకున్నారు. తమ మిత్రుల్లో ఆపదలో ఉన్న వారిని ఆర్థికంగా ఆదుకుకోవాలని నిర్ణయించారు. కార్యక్రమంలో నాగవేణి, గౌసియాబేగం, శ్రీలత, సుశీల, మునీంద్ర, మంజుల, బాలమణి, రేణుక, పుష్పలత తదితరులు ఉన్నారు.

తాగునీటి పైపుల పునఃనిర్మాణం



అమరచింత: పట్టణంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో తాగునీటి పైపుల పునఃనిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ తెలిపారు. పాఠశాల మైదానంలో కొత్తగా డైనింగ్ హాలు నిర్మాణ సమయంలో పాఠశాల విద్యార్థుల తాగునీటి సౌకర్యార్థం ఏర్పాటు చేసిన పైప్‌లైన్ పగిలి పోవడంతో నీటి కొరత ఏర్పడకుండా వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. పట్టణంలో తాగునీటి వసతుల కోసం ఎప్పటికప్పుడు తాగునీటి పైప్‌లైన్ల మరమ్మతు పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

కార్మికులకు వైద్య పరీక్షలు

అమరచింత: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో లేబర్ కార్డు ఉన్న ప్రతి కార్మికుడికి ఉచిత వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నామని జిల్లా కోఆర్డినేటర్ తౌఫిక్‌అహ్మద్ తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణంతో పాటు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి కార్మికులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీపీ, షుగర్, ఈసీజీ వంటి పరీక్షలను నిర్వహించామన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఎస్సీ ఈహెల్త్ కేర్ సిబ్బంది నవీన్ కుమార్, వంశీ, జోసెఫ్, చరణ్ పాల్గొన్నారు.

వృథాగా క్రీడా ప్రాంగణాలు

- గ్రామాల్లో అందుబాటులోకి రాని వైనం
- పలుచోట్ల బోర్డులకే పరిమితం
- వసతుల కల్పనలో నిర్లక్ష్యం
- నిరాశలో గ్రామీణ క్రీడాకారులు



వెళ్లేందుకు దారి లేని వర్కూర్ క్రీడాప్రాంగణం

మాగనూర్: జిల్లావ్యాప్తంగా సీఎం కప్ నిర్వహణతో కొన్నిరోజులపాటు పండగ వాతావరణం నెలకొంది. మండలస్థాయిలో సీఎంకప్ క్రీడాకారులకు భారీ స్థాయిలో ఏర్పాట్లుచేశారు. అయితే అది మున్నాళ్ల ముచ్చటగానే మారింది. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటుచేసిన క్రీడాప్రాంగణాలపై పట్టింపు కరువైంది. వసతుల లేమితో, మరికొన్ని ప్రదేశాల్లో స్థలాలు



బైరంపల్లి క్రీడాప్రాంగణం (ఫైల్)

గ్రామాలకు దూరంగా కేటాయించడంతో యువత మైదానాలకు వెళ్లేందుకు అసక్తి చూపడంలేదు. మండల వ్యాప్తంగా ఏ ఒక్క గ్రామంలోను పూర్తిస్థాయిలో వసతులతో మైదానాలు అందుబాటులోకి తీసుకురాలేదు.

రూ. 4లక్షలతో ఏర్పాటు..

ఉపాధిహామీ పథకం నుంచి క్రీడాప్రాంగణాల ఏర్పాటుకు రూ. 4 లక్షల వరకు వినియోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. నిధులతో క్రీడా పరికరాల ఏర్పాటు, మైదానం చదును, బాస్కెట్‌బాల్, ఖో–ఖో, కబడ్డీ, లాంగ్‌జంప్, హైజంప్ వంటి క్రీడలకు సంబంధించిన కోర్టులు ఏర్పాటుచేయాలి. కొన్నిచోట్ల స్థలాల కొరత ఉన్నప్పటికీ కొన్ని గ్రామాల్లో ఏర్పాటుచేసిన క్రీడా మైదానాలు చెట్ల పొదలు, గుట్టలు, బురదతో దర్శనమిస్తున్నాయి. క్రీడా ప్రాంగణాల ఏర్పాట్లు వసతులపై దృష్టి సారించాలని గ్రామాల్లోని క్రీడాకారులు కోరుతున్నారు.

యువత క్రీడలకు దూరం..

గ్రామాల్లో ఆట స్థలాలు లేకపోవడంతో యువత క్రీడలకు దూరమవుతున్నారు. గ్రామానికో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం క్రీడాకారుల పాలిటశాపంగా మారుతొంది. ఇప్పటికైనా ప్రభుత్వం క్రీడామైదానాలపై దృష్టిసారించాలని క్రీడాకారులు కోరుతున్నారు.

తూతూమంత్రంగా..



గ్రామీణా ప్రాంతాలలో ఏర్పాటుచేసిన క్రీడామైదానాలు అధికారులు ఏదో ఉన్నతాధికారులు అడుగుతారనే ఆలోచనతో తూతూమంత్రంగా ఏర్పాటు చేసి ప్రజాధనాన్ని వృథా చేశారు. ఇప్పటికై నా ఉన్నతాధికారులు స్పందించి క్రీడాప్రాంగణాలు వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

– అశోక్, యువకుడు, కొత్తపల్లి

సదుపాయాలు కరువు..



ప్రస్తుతం నేను ఇండియన్ ఆర్మీకోసం కఠోర శ్రమతో కృషిచేస్తున్న ఇప్పటికే రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించాను. అయితే ఈవెంట్స్ కోసం సాధన చేద్దామంటే క్రీడాప్రాంగాణంలో సరైన సదుపాయాలు లేక సమీప పెద్దవాగులో సాధన చేస్తున్న.

– హరీశ్, మాగనూర్, యువదుకు

వినియోగించుకోవాలి..



మండలంలో దాదాపుగా అన్ని క్రీడాప్రాంగణాలు అందుబాటులో ఉన్నాయి. గ్రామీణా యువకులు వాటిని వినియోగించుకోవాలి. సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– జైపాల్‌రెడ్డి, ఎంపీఓ, మాగనూర్

హంపయ్య స్వామికి రాష్ట్రస్థాయి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న హంపయ్యస్వామి

కోస్గి: పట్టణానికి చెందిన ప్రముఖ పురోహితులు శివశ్రీ మఠం హంపయ్యస్వామికి లలితకళా సమాఖ్య, రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం వారు 'వేదాగమ ప్రవీణ' పురస్కారంతోపాటు 'సువర్ణ కంకణ ధారణ' చేసి సత్కారించారు. ఈ మేరకు ఆదివారం సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పలువురు ప్రముఖుల చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు. హంపయ్యస్వామికి రాష్ట్రస్థాయిలో పురస్కారం రావడంపై పలువురు భక్తులు హర్షంవ్యక్తం చేశారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు



సమావేశమైన ఆలయ కమిటీ సభ్యులు

నారాయణపేట రూరల్ : శ్రావణమాసం సమీపిస్తున్న నేపథ్యంలో లోకాయపల్లి లక్ష్మమ్మ ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కల్గకుండా అన్నిఏర్పాట్లు చేపడుతున్నట్లు ఆలయ కమిటీసభ్యులు తెలిపారు. ఆదివారం సమావేశమైన సభ్యులు పలు అంశాలపై చర్చించారు. ఈ నెల 18న మొదటి శుక్రవారంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, ఆలయ పరిసరాల్లో అపరిశుభ్రత లేకుండా తగిన చర్యలు చేపట్టాలన్నాని, ఇటీవల భక్తుడు రవికుమార్‌గౌడ్ అందించిన రేలింగ్‌ను ఏర్పాటుచేసి భక్తులు క్యూలో దర్శనానికి వెళ్లేవిధంగా ఏర్పాట్లు చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే టెంకాయల వేలం పూర్తయిందని, విద్యుత్‌దీప అలంకరణకు ఆర్డర్ ఇస్తామన్నారు. 17న పట్టణంలోని అర్చకుల ఇంటినుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాలతో పల్లకిసేవా లోకాయపల్లి వరకు కొనసాగుతుందన్నారు. ఈసమావేశంలో అధ్యక్షుడు రాంబాబు, సెక్రెటరీ మధుసూదన్‌రెడ్డి, ట్రెజరర్ లప్ప అశోక్, ఉపాధ్యక్షుడు కన్నజగదీష్, రాధాకృష్ణ, బుగ్గన్న, పిల్లి నర్సింహులు, చంద్రశేఖర్‌గౌడ్, సర్పంచ్ జమునాబాయి, ఎంపీటీసీ రాంరెడ్డి, శ్రీనివాస్, ఆత్మారాం పాల్గొన్నారు.

నేడు ఉర్సు ప్రారంభం



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం రామయ్య బౌలీ హజ్రత్ షేక్ రఫీయోద్దీన్‌షా ఖాద్రీ దర్గా ఉర్సు వేడుకలను సోమవారం నిర్వహిస్తున్నట్లు ముతవల్లీ షైక్ సైఫోద్దీన్ ఖాద్రీ వెల్లడించారు. గంథోత్సవం, ధార్మిక సదస్సు ఉంటుందని వివరించారు. ముఖ్యఅతిథులుగా హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ రఫీయోద్దీన్ హుస్సేని, మహ్మద్ మహమూద్ హుస్సేని, మహ్మద్ అబ్దుల్ మొయిజ్, అబ్దుల్ మొహిమిన్, రిజ్వాన్‌పాష ఖాద్రీ, ఇఫ్తేకార్, కర్నూల్‌కు చెందిన హుస్సేని పీర్ హుస్సేని, కర్నాటక గోగి షరీఫ్‌కు చెందిన సయ్యద్ షా చందా హుస్సేని ధార్మిక వేత్తలు హాజరై సందేశాలు ఇస్తారని తెలిపారు.

కాంగ్రెస్ విజయం ఖాయం

కోయిల్‌కొండ: రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు మహేందర్‌నాయక్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో ఎస్టీసెల్ అధ్యక్షుడిగా ఆయన ఎంపిక కావడంపై సన్మాన కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ యూత్ కన్వీనర్ రవినాయక్ మంగ్యానాయక్, రాముసాయక్, విఠల్, రఘునాథ్, థావ్యానాయక్ పాల్గొన్నారు.

మత్స్యకార్మికులకు గుర్తింపు కార్డుల పంపిణీ



గుర్తింపు కార్డులు అందిస్తున్న నాయకులు

ఊట్కూర్: మండల కేంద్రంలో మత్స్యకార్మిక సహకార సంఘం అధ్యక్షుడు వెంకట్రాములు ఆధ్వర్యంలో ఆదివారం సభ్యులకు గుర్తింపుకార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్యకార్మిక సహకార సంఘంలో 585మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. వారికి ప్రత్యేకంగా గుర్తింపు కార్డులు తయారు చేయించి పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రధాన కార్యదర్శి వసంత్‌కుమార్, నాయకులు భరత్, కర్ణాకర్, శ్రీనివాస్, వెంకట్‌నారాయణ, ప్రకాశ్, లక్ష్మన్ పాల్గొన్నారు.

అవార్డు అందజేత



మక్తల్: పట్టణంలోని మల్లికార్జునస్వామి ఆలయ పూజారి తిప్పయ్యస్వామికి హైదరాబాద్‌లోని హరిహర కళావేదిక భవనంలో లలిత కళా సమాఖ్య ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సువర్ణ కంకణ అవార్డును శ్రీకృష్ణ, చాముండేశ్వరి, మహేశ్వరి చేతులమీదుగా అందజేశారు. తిప్పయ్యస్వామికి అవార్డు రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

జింకలతో పొలాలు ధ్వంసం



మక్తల్: నియోజకవర్గంలో జింకలు పంటలను పూర్తిగా నాశనం చేస్తున్నాయని, వాటి నుంచి పంటలను కాపాడాలని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఈ సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించారు. అలాగే మక్తల్ నుంచి నారాయణపేటకు వెళ్లే రోడ్డు సక్రమంగా లేదని, కాంట్రాక్టర్ పనులు చేయడం లేదన్నారు. త్వరగా రోడ్డు పనులు పూర్తిచేయించాలని విజ్ఞప్తి చేశారు.

అరెస్టులు అప్రజాస్వామికం



పేట పీఎస్‌లో ఎస్ఎఫ్ఐ నాయకులు

నారాయణపేట రూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థి ఉద్యమాలకు భయపడి అక్రమ అరెస్టులు చేయించడం అప్రజాస్వామికమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరహరి విమర్శించారు. ఆదివారం చేపట్టిన చలో హైదరాబాద్ –అసెంబ్లీ ముట్టడిని అడ్డుకున్న పోలీసులు విద్యార్థి సంఘం నాయకులను అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జిల్లా కేంద్రంతోపాటు మద్దూర్, మాగనూర్, దామరగిద్ద మండలాల్లో ముందస్తు అరెస్టులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన విద్యావిధానం తెలంగాణలో అమలు చేయమని అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ స్కాలర్‌షిప్పులు, ఫీజురియింబర్స్‌మెంట్‌లను వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో రవికిరణ్, ప్రవీణ్, శశికిరణ్, నవీన్, సాకేత్, నయిమ్ పాల్గొన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్‌కు నివాళి

మక్తల్: పట్టణంలోని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ప్రజా గాయకుడు గద్దర్‌కు ఘన నివాళులర్పించారు. గద్దర్ ప్రజాపోరాటాలపై వివిధ సమస్యలపై పోరాటం చేశారని గుర్తుచేసుకున్నారు. అనంతరం కొవ్వొత్తులను వెలగించి ఆత్మకుశాంతి చేకురాలని నివాళులర్పించారు. కార్యక్రమంలో నారాయణ, మద్దిలేటి, వేణుగోపాల్, పృద్వీరాజ్, కృష్ణ, కర్రె కృష్ణ, దత్తు, శంకర్, చంద్రశేఖర్, పోలప్ప, వెంకటేష్, మద్దిలేటి, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమం

ఆత్మకూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని జిల్లా కార్యదర్శి రహ్మతుల్లా, ఉపాధ్యక్షుడు గంగాధర్ అన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో ఎన్నికల కోఆర్డినేషన్ కార్యక్రమంలో రాష్ట్ర ఇన్‌చార్జీ మాణిక్‌రావ్‌ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ విధివిధానాలను వివరించారన్నారు. ఆత్మకూర్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా పండుగల సందర్భంగా జెండా కట్టలకు రంగులద్ది ముస్తాబు చేశారు. బీఆర్ఎస్ మోసపూరిత వాగ్దానాలు, బీజేపీ మతతత్వ పాలనతో ప్రజలు విసుగెత్తి పోయారని అన్నారు.

ప్రస్తావన కాదు.. ప్రకటన కావాలి



దీక్షలో మాట్లాడుతున్న అఖిలపక్షం నాయకులు

నారాయణపేట రూరల్: ప్రస్తావనతోనే ముగింపు పలకకుండా ప్రకటన చేయించాలని ఎమ్మెల్యేను సాధన సమితి నాయకులు కోరారు. స్థానిక శిబిరంలో ఆదివారం 89వ రోజు నిరసన దీక్షలు కొనసాగాయి. అఖిలపక్షం నాయకులు హాజరుకాగా వారికి సాధన సమితి నాయకులు దండలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. శాసనసభ సమావేశాల్లో ఎమ్మెల్యేకోరిన విధంగా ప్రభుత్వం స్పందించి కాన్‌కుర్తి, గార్లపహాడ్, కోటకొండలను మండలాలుగా ప్రకటిస్తూ జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యాదగిరి, చెన్నప్ప, ప్రవీణ్, బాలప్ప, రాజు, రాములు, నారాయణ, బాలకృష్ణ, కాశప్ప, కిష్టప్ప, రాజు, శ్రీనివాసులు, లక్ష్మప్ప, నారాయణ, బస్సప్ప తదితరులు పాల్గొన్నారు.

రేపు మత్స్యసహకారంపై అవగాహన



మాట్లాడుతున్న చైర్మన్ కోళ్ల వెంకటేశ్

నారాయణపేట: మత్స్య సహకారంపై మంగళవారం నిర్వహించే సంఘం అధ్యక్షుల అవగాహన సభను విజయవంతం చేయాలని జిల్లా మత్స్య సహకార సంఘం చైర్మన్ కోళ్ల వెంకటేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఎస్ఆర్ గార్డెన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కారం, ప్రభుత్వాల నుంచి ఆశించే ప్రజాసంక్షేమం తదితర వాటిపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర మత్స్య సహకార సంఘం చైర్మన్ పిట్టల రవీందర్ హాజరవుతున్నారన్నారు. ఈ సమావేశంలో జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సరాఫ్ నాగరాజు, రాష్ట్ర నాయకుడు రుషి, డైరక్టర్ రాములు పాల్గొన్నారు.

ఉందేకోడ్‌కు బస్సుసర్వీస్ కొనసాగించాలి

మరికల్: రాత్రి సమయంలో మరికల్–ఉందేకోడ్‌కు బస్సురాకపోకలను కొనసాగించాలని కాంగ్రెస్ నాయకులు హరిష్, రామకృష్ణ, మొగులప్ప, ఆంజనేయులు అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రతిరోజూ రాత్రి సమయంలో మరికల్ నుంచి ఉందేకోడ్‌కు వెళ్లాల్సిన బస్సుసర్వీస్‌ను పేట డిపో అధికారులు రద్దుచేయడంతో కన్మనూర్, బూడ్యాగానితాండ, గాజులయ్యతాండ, ఉందేకోడ్‌కు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే బస్సుసర్వీస్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు.

ముడుమాల్ శివాలయంలో శ్రమదానం



శ్రమదానం చేస్తున్న అర్చక బృందం

కృష్ణా: ముడుమాల్‌లో కృష్ణానదితీరంలోని అతిపురాతన శివాలయం ఆవరణలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలను అర్చకబృందం ఆదివారం శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం అధిక శ్రావణమాసం కావడంతో శుభకార్యాలు ఏవిలేవని, అందుకుగాను ప్రతిఆదివారం ఆవణంలో శ్రమదానం నిర్వహించేందుకు తమ అర్చక బృందం నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్చక బృందం రాజుస్వామి, కుమారస్వామి, మంజుస్వామి, సేడం రాజు, సోమశేఖర్‌స్వామి, అభిస్వామి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపిస్తే పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న శివకుమార్‌రెడ్డి

ధన్వాడ: మండల కేంద్రంలో సమస్యలు పరిష్కరించాలని కార్మికులు చేపడుతున్న సమ్మెకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బాధ్యుడు కుంభం శివకుమార్‌రెడ్డి కాంగ్రెస్ తరుపున మద్ధతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలు పట్టించుకోని కేసీఆర్‌ను వచ్చేఎన్నికలో ఓడించి మెడలు వంచుదామని అన్నారు. తమసమస్యల పరిష్కారంకోసం ఉద్యమిస్తున్న కార్మికులకు పార్టీ తరుపున సహాయ సహకారాలు అందిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తామని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నరహరి, బాలకృష్ణ, లక్ష్మయ్య, రాఘవేందర్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్, సత్యరెడ్డి, గోవర్ధన్‌గౌడ్, వెంకట్‌రాములు, క్రాంతి, యూసుఫ్, ఖదీర్, నరేందర్‌గౌడ్, సదాశివరెడ్డి, బాలరెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

ఘనంగా జయశంకర్ జయంతి



పేటలో ప్రొఫెసర్‌కు నివాళులర్పిస్తున్న తపస్‌నాయకులు

నారాయణపేట రూరల్: ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకొని పేటలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక డీఈఓ, ఎంపీడీఓ, తహసీల్దార్, ఎమ్మార్సీ కార్యాలయాల్లో, ఆర్టీసీ డిపోలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన కృషిని గుర్తుచేసుకున్నా రు.అదేవిధంగా స్థానిక సీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రంగారెడ్డి ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు జయశంకర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. అలాగే తపస్ శాఖ ఆధ్వర్యంలో మండల వనరుల కేంద్రంలో ప్రొఫెసర్‌కు నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి ఆయనచేసిన సేవలను కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో శ్రీనివాస్‌గౌడ్, గుంపుబాలరాజు, నర్సింహ, కుర్మయ్య, చంద్రకాంత్, గుర్నాత్‌రెడ్డి, రాఘవ, సాయి, తిరుపతి, వెంకట్రాములు పాల్గొన్నారు.

నారాయణపేట: ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకల్లో భాగంగా ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు విజయ్‌సాగర్ ఆయన చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చెన్నారెడ్డి, గందె చంద్రకాంత్, గురులింగప్ప, వెంకటేశ్, శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, బండి శివరాంరెడ్డి పాల్గొన్నారు.

కోస్గి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జయశంకర్ జయంతిని నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో ప్రొఫెసర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మధుకర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ ఆశయాల సాధనకు ఆయన చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాయిలు, కార్యాలయ సిబ్బంది నసీర్, హన్మంతు పాల్గొన్నారు.

మరికల్: మండలంలోని గౌతమి మోడల్‌స్కూల్‌లో ఆచార్య జయశంకర్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రావడానికి చేసిన సేవలు, ఉద్యమాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధన్వాడ: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఆదివారం జయశంకర్ జయంతిని నిర్వహించారు. అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఈఓ వెంకట్రాములు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పేటలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కోస్గిలో చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు